# ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్


- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి


కౌంటింగ్ కేంద్రంలో టెక్నికల్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ కౌంటింగ్ పరిశీలకులు సీఆర్ ప్రసన్న, ఎస్ జేడ, మనీష్ కుమార్ లోహన్ సమక్షంలో పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియలో కౌంటింగ్ పరిశీలకులు సీఆర్ ప్రసన్న, ఎస్ జేడ, మనీష్ కుమార్ లోహన్ పాల్గొన్నారు. కాగా, నగరంలోని ఎస్సారార్ కళాశాలలో జిల్లాలోని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 390 పోలింగ్ కేంద్రాల్లో 27 మంది అభ్యర్థులకు పోలైన ఓట్లను ఆదివారం లెక్కించడానికి 22 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 28 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 22 మంది మైక్రో అబ్జర్వర్లు, 16 రిజర్వుడ్ సిబ్బందితో కలుపుకొని మొత్తం 88 మందిని నియమించారు. మానకొండూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 316 పోలింగ్ కేంద్రాల ద్వారా 10 మంది అభ్యర్థులకు పోలైన ఓట్లను లెక్కించడానికి 17 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 20 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 17 మంది మైక్రో అబ్జర్వర్లు, 14 మంది రిజర్వ్‌డ్ సిబ్బందితో కలుపుకొని 68 మందిని నియమించారు. హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాల ద్వారా 22 మంది అభ్యర్థులకు పోలైన ఓట్లను లెక్కించడానికి 17 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 20 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 17 మంది మైక్రో అబ్జర్వర్లు, మరో 15 మంది రిజర్వ్‌డ్ సిబ్బందితో కలుపుకొని 69 మందిని నియమించారు. చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గంలోని 327 పోలింగ్ కేంద్రాల్లో 14 మంది అభ్యర్థులకు పోలైన ఓట్లను లెక్కించడానికి 16 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 18 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 16 మంది మైక్రో అబ్జర్వర్లు, మరో 14 మంది రిజర్వ్‌డ్ సిబ్బందితో కలుపుకొని 64 మంది చొప్పున మొత్తం 305 మందిని నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని, అనంతరం ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాలుగు నియోజకవర్గాల ఆర్‌వోలు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మహేశ్వర్, రాజు, సీపీవో కొమురయ్య, డీఐవో శివరాం, డీటీవో నాగరాజు, పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### కౌంటింగ్ కేంద్రం సందర్శన

ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని శనివారం సాయంత్రం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఏర్పాట్లపై ఆర్‌వోలు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు.


కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు


వేడుకలకు హాజరైన ఏసీ చంద్రశేఖర్, నిర్వాహకులు

# ఘనంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

కమాన్‌చౌరస్తా, డిసెంబరు 2: నగరంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంలో శనివారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. దేవతా పూజలు, హోమాలు, పాళ పూర్ణాహుతి, యంత్ర, విగ్రహ ప్రాణప్రతిష్ఠా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, ఈవో ఎండపల్లి మారుతి, వ్యవస్థాపక ధర్మకర్తలు నలువాల ప్రకాశ్, చిట్టుమల్ల కొండయ్య, ఆయిందాల లక్ష్మయ్య, వేదపండితులు కపర్ధిశర్మ, దుర్గాప్రసాద్ శర్మ, ప్రణీత శర్మ, ఆర్చకులు, సిబ్బంది గుడికాడి శ్రీనివాస్, పిట్టల అంజయ్య, డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్‌కుమార్, శ్రీధర్, ఎం సత్యం, శ్రీనివాస్, చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

# ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ మనోహర్


శ్రీరంగ ప్రసాద్‌కు ఉత్తర్వు పత్రం అందజేస్తున్న వీసీ ఆచార్య మల్లేశ్


మనోహర్

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 2 : శాతవాహన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం నూతన కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఈ మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మల్లేశ్ సంకసాల నియామక పత్రాన్ని అందజేశారు. ఇక్కడ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఫైనాన్స్ ఆఫీసర్ రవీందర్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్, డాక్టర్ వన్నాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

### ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్‌గా శ్రీరంగ ప్రసాద్

శాతవాహన విశ్వ విద్యాలయం ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఉపకులపతి ఆచార్య మల్లేశ్ సంకశాల నియామక ఉత్తర్వులు అందజేశారు.




భక్తులనుద్దేశించిన ప్రసంగిస్తున్న వేద పండితుడు మహేశ్వర శర్మ

సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు

# భక్తిలో ఆర్తి ఉండాలి

- వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ
- దుర్గా భవానీ ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 2: భక్తిలో ఆర్తితో పాటు చిత్తశుద్ధి, ఏకాగ్రత శరణాగతి ఉండాలని వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ సూచించారు కార్తీక మాసం సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆయలంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వ్రతం ఆచరించారు. ఈ సందర్భంగా వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ పూజల్లో ఆలయల ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ, ఆలయ ఫౌండర్ చైర్మన్ లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు ఈసీఐ మార్గదర్శకాలు పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 2: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆదివారం నిర్వహించే ఓట్ల లెక్కింపు సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకనుగుణంగా నడుచుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఓట్ల లెక్కింపు జరిగే ఎస్సారార్ కళాశాల ఆవరణలోకి, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈక్రమంలో ఆప్రాంతంలోకి ప్రజలను ఎవరిని అనుమతించబోరని, ఆ ప్రాంతమంతా పోలీసుల ఆధీనంలో ఉంటుందన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఉంటుందన్నారు. అభ్యర్థులకు వచ్చే ఓట్ల ఆధారంగా అభ్యర్థుల గెలుపోటములను ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు ప్రకటిస్తారని, అనంతరమే ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిని అందుకునేందుకు అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే లోనికి వెళ్లే అవకాశముంటుందని తెలిపారు. అభ్యర్థుల గెలుపునకు సంబంధించి ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదని, ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి వ్యవహరిస్తే, పరిసరాల్లో ఉండే ఎన్నికల పరిశీలన బృందాలు వీడియో తీసి, ఎన్నికల సంఘానికి నివేదిస్తాయని స్పష్టం చేశారు. అభ్యర్థుల గెలుపు ప్రకటన చేసిన అనంతరం కార్యకర్తలెవరు కూడా ఉద్రేకాలకు లోను కాకూడదని, ఇతరులపైకి వెళ్లి గొడవలు సృష్టించినా, ఆస్తులు ధ్వంసం చేసినా, ఓడిన అభ్యర్థులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా గుర్తించి క్రిమినల్ కేసు నమోదు చేస్తారని హెచ్చరించారు.

## అంతర్జాతీయ డిజిటల్ లిటరసీ డే

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 2: నగునూర్‌లోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాల(కరీంనగర్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్ విభాగం సౌజన్యంతో శనివారం అంతర్జాతీయ డిజిటల్ లిటరసీ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల చైర్మన్ రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థినులకు పోటీ ప్రపంచంలో డిజిటల్ లిటరసీ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు డిజిటల్ లిటరసీ గురించి స్కిట్, నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి లలితా అశ్విని, లైబ్రేరియన్ మోహన్‌రావు, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు ఆర్ ఇందిర, శారద, సమత, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


వేడుకవకు హాజరైన అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల చైర్మన్ రవీందర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, తదితరులు